DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
మంగళవారం, నవంబరు 28, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఎన్నికల రోజున ఉద్యోగులకు సెలవు ఇవ్వండి.. ఆదేశించిన సీఈవో



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో అంటే.. నవంబర్ 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలు సెలవు ప్రకటించాలని ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని సంస్థలు సెలవు ఇవ్వాని ఆదేశించారు. సెలవు ఇవ్వని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఎన్నికల వేళ (2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ) కొన్ని సంస్థలు సెలవు ఇవ్వనట్లు తమకు ఫిర్యాదులు అందినట్లు సీఈవో తెలిపారు. ఈ మేరకు ఈ ఎన్నికలకు అన్ని సంస్థలు సెలవు ఇచ్చాయో లేదో పరిశీలించాలని కార్మిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు.

# 24 ఏండ్లుగా తెలంగాణ ఆశగా, శ్వాసగా బతుకుతున్నాను: సీఎం కేసీఆర్



గజ్వేల్ : గత 24 ఏండ్లుగా తెలంగాణ ఆశగా, శ్వాసగా బతుకుతున్నానని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. గజ్వేల్ నుంచి మీరు అవకాశం ఇచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి పంపిస్తే ఈ రాష్ట్రం కోసం కష్టపడ్డాను, కృషి చేశాను. అవన్నీ ప్రజల కండ్ల ముందు కనబడుతున్నాయి అని కేసీఆర్ తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ నియోజకవర్గం నుంచి కేసీఆర్ పోటీలో ఉన్నారు.

ఈ ఎన్నికల్లో ఇది నా చివరి సభ.. ఇది 96వ సభ. తెలంగాణ రాష్ట్రం గురించి కూడా ఒకసారి చెప్పాలి. గజ్వేల్ నుంచి మీరు అవకాశం ఇచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసి పంపిస్తే ఈ రాష్ట్రం కోసం కష్టపడ్డాను. కృషి చేశాను. అవన్నీ ప్రజల కండ్ల ముందు కనబడుతున్నాయి. ఇక్కడ వచ్చేటటువంటి ట్రిపుల్ ఆర్ కూడా మన గజ్వేల్ మీదుగానే రాబోతుందని సంతోషంగా తెలియజేస్తున్నా. 24 ఏండ్లుగా తెలంగాణనే ఆశగా, శ్వాసగా బతుకుతున్నాను. ఆ విషయం మీ అందరికి తెలుసు అని కేసీఆర్ పేర్కొన్నారు.

### ఇందిరమ్మ రాజ్యం ఎవరికి కావాలి ఇప్పుడు..?

ఉద్యమ సందర్భంలో తెలంగాదణ ఎట్ల తేవాలని ఆరాట పడ్డాను. పోరాటం చేశాను. కాంగ్రెస్ పార్టీ మోసం చేసినా తట్టుకోని, నిలబడి, మొండిగా, చివరకి మళ్లీ ధోకా చేశారని గుర్తించి, ఇక తప్పదనే నమ్మకానికి వచ్చి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని ఆమరణ దీక్ష చేస్తే, 33 పార్టీలు మనకు అండగా వస్తే అప్పుడు దిగొచ్చింది ఈ కాంగ్రెస్ పార్టీ. ఇవాళ కాంగ్రెస్ పార్టీ అనేక విషయాలు మాట్లాడుతోంది. మేం గెలిస్తే మళ్ల ఇందిరమ్మ రాజ్యం తెస్తమని చెబుతున్నారు. ఇందిరమ్మ రాజ్యం ఎవరికి కావాలి ఇప్పుడు. అసలు నాకర్థం కాదు. ఇందిరమ్మ రాజ్యం సక్కగా ఉంటే ఎన్టీ రామారావు పార్టీ పెట్టి 2 రూపాయాలకే కిలో బియ్యం ఎందుకు ఇయ్యాల్సి వచ్చింది. అప్పటి వరకు మన రాష్ట్రం ఆకలి కడుపుతోనే ఉన్నది కదా..? ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ రోజులు వచ్చాయి. ఇందిరమ్మ రాజ్యంలోనే కదా ఎన్‌కౌంటర్లు, రక్తపాతం జరిగింది. మన తెలంగాణ ఉద్యమంలో 1969లో 400 మందిని కాల్చి చంపింది. ఇవన్నీ కావాలని మళ్లీ కోరుతున్నారు. ఇది ఎట్ల ఉందంటే తద్దినం ఉందని భోజనానికి పిలిస్తే రోజు మీ ఇంట్లో ఇట్లనే జరగాలని అన్నడట యెన్కటికి ఒకడు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ గెలిచేది లేదు సచ్చేది లేదు. కానీ గెలిస్తే మటుకు ఇందిరమ్మ రాజ్యం తెస్తమని మాట్లాడుతున్నారు అని కేసీఆర్ ధ్వజమెత్తారు.



## మార్పు కోసం కాంగ్రెస్‌కి ఓటేయండి

### తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ సందేశం

కాసేపట్లో ప్రచార పర్వం ముగుస్తుండటంతో తెలంగాణ ప్రజలకు సోనియా గాంధీ ఎన్నికల సందేశం విడుదల చేశారు. తెలంగాణ అమరవీరుల స్వప్నాలు పూర్తి అవడం తాను చూడాలనుకున్నట్లు తెలిపారు. దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చాలని ప్రజలకు సోనియా గాంధీ పిలుపునిచ్చారు. తెలంగాణలో మంచి ప్రభుత్వం రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. మార్పు కోసం కాంగ్రెస్‌కి ఓటేయాలని తెలంగాణ ప్రజలను సోనియా గాంధీ కోరారు.



## తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని తెలిసి బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయి..

హైదరాబాద్ (వాయిస్ టుడే): ఐదు రాష్ట్రాలలో ఎన్నికల ప్రచారం ఉంటే మిజోరం ఎందుకు వెళ్ళలేదని బీజేపీ అగ్రనేతలను ఉద్దేశించి రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. నేడు గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో సర్కార్ ఆటోమోడ్‌లో నడుస్తోందన్నారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు బాగున్నాయని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని తెలిసి బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పోయాయన్నారు. రాజస్థాన్ లో పేపర్ లీకు కేసులో బాధ్యులపై కఠినంగా వ్యవహరించామన్నారు. ఎన్నికల్లో గెలవడానికి ఈడీని బీజేపీ ప్రయోగిస్తోందన్నారు. అవినీతిలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని అశోక్ గెహ్లాట్ పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి పాటకు స్టెప్పులేసిన ప్రియాంక గాంధీ



సంగారెడ్డి (వాయిస్ టుడే): జిల్లాలోని జహీరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రోడ్ షోలో అగ్రనేత ప్రియాంక గాంధీ , పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ రోడ్‌షోకు భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. జహీరాబాద్‌లో కార్నర్ మీటింగ్‌లో ప్రియాంక ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పాటకు ప్రియాంక గాంధీ స్టెప్పులేసి అందరినీ ఉత్సాహపరిచారు. దొరల తెలంగాణ కావాలో... ప్రజల తెలంగాణ కావాలో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని ప్రియాంక అన్నారు. దేశంలో ఫామ్ హౌస్‌లో ఉండి పాలించే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఓవైసీ పోటీ చేస్తారని.. తెలంగాణలో అన్నిచోట్ల ఎందుకు పోటీ చేయరని ప్రశ్నించారు. అక్రమాలతో దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ధనిక పార్టీలుగా మారాయన్నారు. రూ.16 వేల కోట్లతో విమానాలు, అదాని రుణాలు మాఫీ చేసే మోడీకి పేదల రుణాల మాఫీ గుర్తుకు రాదని విమర్శించారు. కరోనా సమయంలో దేశ ప్రజలు అల్లాడితే మోడీ ఆదుకోవడంలో విఫలం అయ్యారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు అమలు చేస్తామని అన్నారు. రెండు లక్షల వరకు ఏకకాలంలో రైతుల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌కు బై బై చెప్పే సమయం ఆసన్నం అయిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు చేశారు.

## కేసీఆర్ అహంకారంపై ఈటల గెలిచారు



సిద్దిపేట జిల్లా: హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కేసీఆర్ అహంకారంపై ఈటల రాజేందర్ గెలిచారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్, మంద కృష్ణమాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. "తెలంగాణను తమ జాగీరుగా భావిస్తున్న కేసీఆర్‌ను ఓడించడానికి బీజేపీ అభ్యర్థి ఈటల గజ్వేల్‌కు వచ్చారు. నాకు ఏ పదవి కావాలన్నా ఇచ్చే వారు ఉన్నారు. కానీ మాదిగ ఉద్యమం నీరు కారుతుందని తీసుకోలేదు. ఎస్సీ వర్గీకరణ చేస్తానని కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది అందుకే నో కాంగ్రెస్ అన్నాను. కేసీఆర్‌కు మాదిగల పట్ల కృతజ్ఞతా భావం లేదు. అందుకే మాదిగలను అణిచి వేస్తుంది." అని ఆరోపించారు.



## రాష్ట్రానికి సీఎం ఉంటాడు.. రాష్ట్రాన్నే తెచ్చిన సీఎం కేసీఆర్

కామారెడ్డి: రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉంటాడు కానీ.. రాష్ట్రాన్ని తెచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి గంజ్, జేపీఎన్ రోడ్‌లోని ఇస్లాంపురలో మంత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... కేసీఆర్ అమ్మమ్మ ఊరు కామారెడ్డి జిల్లాలో ఉందన్నారు. కేసీఆర్ కామారెడ్డికి లోకల్.. రాష్ట్రమంతటికే లోకల్ అన్నారు. గజ్వేల్‌లో సీడ్స్ కంపెనీలు లైన్ కట్టి మరీ పెట్టబడులు పెడుతున్నారని తెలిపారు. 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నారని.. కానీ తెలంగాణలో మాత్రమే వారికి పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. దేశంలో నిత్యవసర సరుకులు ధరలు పెరిగాయన్నారు. "మోడీని ప్రియమైన మోడీగా పిలుస్తలేరు పిరమైన మోడీ అంటున్నారు" అని సెటైర్ వేశారు. 2014లో జన్‌ధన్ ఖాతాలో రూ.15 లక్షలు ఇస్తా అన్నారు.. ఇచ్చారా అని ప్రశ్నించారు. "రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1200 చేసిండు మోడీ.. మీరు ఓటువేస్తే రూ.3000 అవుతవి. మోడీ అధికారంలో ఉంటే సామాన్యుడు బతుకలేడు" అని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.



## బీఆర్ఎస్ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావు

కరీంనగర్ జిల్లా: బీఆర్ఎస్ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావని హుజురాబాద్ బీజేపీ అభ్యర్థి, మాజీమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ..."నన్ను గెలిపించుకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఒకడు బ్లాక్ మెయిల్ చేస్తుండు. బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావు బిడ్డా. ప్రశాంతంగా ఉన్న హుజూరాబాద్ గడ్డను బ్లాక్ మెయిల్‌కు వాడటం మంచిది కాదు. రాజకీయాలను ఇంతగా దిగజార్చడం చూస్తే బాధగా ఉంది. కేసీఆర్ రెండేళ్లు నన్ను రాసి రంపాన పెట్టాడు. కేసీఆర్‌ను బొంద పెట్టడమే అంతిమ లక్ష్యం" అని ఈటల రాజేందర్ చెప్పారు.

### కౌశిక్ రెడ్డి ఎమోషనల్ బ్లాక్ మెయిల్

కాగా.. హుజురాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేశారు. మీరు ఓటేసి దీవిస్తే నాలుగో తేదీన జైత్రయాత్ర లేదంటే మా కుటుంబ సభ్యుల శవయాత్రేనని చెప్పారు. కుటుంబ సభ్యులం ముగ్గురం ఆత్మహత్య చేసుకుంటామని కౌశిక్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసే యోచనలో ప్రత్యర్థులు ఉన్నారు.




## భద్రాద్రి కొత్తగూడెంలో గంట ముందే ముగిసిన ఎన్నికల ప్రచారం

భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో గతకొద్దిరోజులుగా జరుగుతున్న ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఈరోజు (మంగళవారం) సాయంత్రం నాలుగు గంటలకు ప్రచారం ముగిసింది. నాలుగు గంటల నుంచి మద్యం దుకాణాలు బంద్ అవగా.. 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. ఈనెల 30న ఉదయం 7 గంటల నుంచి నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతం కావడంతో జిల్లాలో గంట ముందుగానే పోలింగ్ ముగియనుంది. జిల్లాలో మొత్తం ఐదు నియోజకవర్గాల్లో 9,66,439 మంది ఓటర్లు ఉన్నారు. 1098 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 320 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. మొత్తం 95 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పొత్తులో భాగంగా కాంగ్రెస్ నాలుగు స్థానాల్లో, కొత్తగూడెంలో సీపీఐ పోటీలో ఉంది. బీజేపీ, జనసేన కూటమి నేపథ్యంలో బీజేపీ మూడు స్థానాల్లో, జనసేన రెండు స్థానాల్లో పోటీకి దిగింది.

